

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 40 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

నట్టనడి రోహిణీకార్తె ధాటికి నరనరాన మంటలు రేగుతున్నాయి. అల్లంత దూరాన దిబ్బలమీది ముళ్ళజెముడు జాతి పొదలు గ్రీష్మంలో ఒంటికాలిమీద తపస్సు చేస్తున్నట్లు కనిపిస్తున్నాయి. సన్నజెముడు, నాగజెముడు, బ్రహ్మజెముడు మొక్కలు రెండు, మూడు నిలువుల ఎత్తున పొదలు పొదలుగా గుబురుగా పెరిగి కనిపిస్తున్నాయి. రివ్వున వీస్తున్న వేడిగాలులకు సన్నని యిసుక ధూళితో కలిసి మంటల్లా రేగుతున్నది. కనుచూపుమేరలో ఎక్కడా నీడ కనిపించడంలేదు. అంతా యిసుకనేల, ఎడారిలా వున్నది. పొరలు పొరలుగా ధూళి రేగుతున్నది. కుబుసం విడిచిన త్రాచులా తళతళ మెరిసిపోతున్న ఎండమావులు సమీపించగానే చటుక్కున మాయమౌతున్నాయి, అదను దొరికిన దుష్టుడిలో వినయంలా!

వెండికొండల్లా అంతెత్తున మూపురాలతో దిట్టమైన ఎద్దులు కూడా అలిసినట్లుగా అడుగులు వేస్తున్నాయి. వాటి మెడపట్టీలకున్న మువ్వలు సన్నని ధ్వనులు చేస్తున్నాయి. మువ్వలను పరిహసిస్తున్నట్లు మెడగంటలు ఖంగున బలంగా మోగుతున్నాయి. బండిలో కూర్చున్నాడు గానీ శంకర శాస్తుర్లు గారి ఆలోచనలు యింటిమీదే వున్నాయి. యిప్పుడాయన డెబ్బైకి పైబడిన వృద్ధుడు.

ఎఱ్ఱగా పండిన నాగజెముడులా ఉన్నాడు, కందినట్లు. ఆయన తాత నాగసాధువు రూపంలో తనయింటికివచ్చి ప్రాణాలు విడిచి యించుమించు పద్దెనిమిది సంవత్సరాలు అవుతున్నది . పాండవులగుట్టకు వెళ్లే దారిలో తన పొలంలోనే తాత మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేశాడు.

సిద్ధపురుషుడు అడుగుబెట్టిన వేళా విశేషమో, నాగమణి ప్రభావమో, సంవత్సరం తిరక్కుండా శాస్త్రుర్లగారి దశతిరిగింది. చూస్తుండగానే యిటు ఓరుగల్లు నుండి అటు ఒంటిమిట్టదాకా, యిటు అంతర్వేదినుండి అటు గోకర్ణం దాకా శంకరశాస్త్రుర్లు గారి పేరు మారుమోగింది.

ఆయన హస్తవాసి నలుచెరగులా ప్రఖ్యాతి పొందింది. నాగవరప్పాడు దక్షిణభారతంలోని జమీందారులనుండి రాజవంశీకులదాకా పరిచయమైన అగ్రహారమైంది. ఆయన యిల్లు ఆయుర్వేద కుటీరమైంది. నాగవరప్పాడు చెట్ల కింద మేలుజాతికి చెందిన గుఱ్ఱాలను విప్పిన రథాలు, నగిషీలు చెక్కిన పల్లకీలు కనబడడం మామూలు విషయమైంది.

ఐదు సంవత్సరాలపాటు ఆయన పూజామందిరంలో పూజలందుకున్న నాగమణి వున్నట్టుండి మాయమైంది. ఎలా మాయమైందో సంవత్సరం తరువాత గ్రహించి నిలువెల్లా వణికిపోయాడు శాస్త్రుర్లుగారు. కవలపిల్లల్లో మొదటివాడికి నాగభూషణ శర్మ అని పేరుపెట్టుకున్నాడు. రెండవవాడికి నాగుమయ్య అన్న పేరు పురిటిమంచం మీదే స్థిరపడింది. మరొక ఐదుసంవత్సరాలు జారిపోయాయి.

పెద్దకొడుకు పేరుతెలియని భయంకరమైన వ్యాధికి ఎర అయినాడు. రోజు రోజుకు చర్మం పొలుసులలా మారి కచ్చితంగా మాసం వ్యవధిలో వూడిపోయేది. కుబుసం విడిచిన నాగులా మిలమిలా మెరిసిపోయేవాడు. అలా ఇంచుమించు ఒక పక్షం రోజులు, అంతే. మరలా చర్మం మీద పొరలాగా రావడం ప్రారంభం అయ్యేది. చివరి మూడు రోజులు కనుగుడ్లకు కూడా పొరలు కమ్ముకునేవి. చూపు కూడా పూర్తిగామందగించి తడుముకుంటూ నడిచేవాడు. అది పొలుసుమేహం అనే భయంకరమైన చర్మవ్యాధి అని అందరికీ చెప్పాడు శాస్త్రుర్లుగారు. అయ్యో అనుకున్నారు అందరూ. ఎవరికి తెలుసు ఆయన అబద్ధం చెబుతున్నాడని?

ముత్తాతల తండ్రుల పూర్వంనుండి, ఏడు తరాలుగా వంశపారంపర్య సంపదగా వచ్చిన తాళపత్రగ్రంథాలను మధించాడు. ఆయుర్వేద బ్రహ్మలను వేడుకున్నాడు. అలకనంద గుహలలో సాధువులను, సాధకులను ప్రశ్నించాడు. ఆయనకు కావలసిన సమాధానం దొరకలేదు. పెద్దకొడుకువ్యాధికి విరుగుడు దొరకలేదు. కానీ చిన్నకొడుకు అదృష్టం కొద్దీ బ్రహ్మగారుడము అనే ప్రాచీన మంత్రశాస్త్ర తాళపత్ర గ్రంథం దొరికింది.

పన్నెండు సంవత్సరాల కఠోర సాధనలో నాగుమయ్యను నాగజాతికి అజేయుడిని చేశాడు. అపర గరుత్మంతుడిని చేశాడు. శీతాకాలంలో గ్రహణ దినాలలో మొలలోతు నీళ్ళల్లో బీజాక్షర మంత్ర మననం చేయించాడు. నడిమి గ్రీష్మంలో పాండవులగుట్టమీది నల్లరాతి శిలలమీద ఒంటికాలి మీద నిలబెట్టి మననం చేయించాడు.

కొడుకుతో చేయిస్తున్న కఠినమైన ఆ సాధనను చూసి కలవరపడి కన్నీరు పెట్టుకుంది పార్వతమ్మ. చూసీ చూసీ 'అంత కఠోరమైన సాధన అవసరమా' అని అడిగింది చివరికి. 'మనిద్దరినీ సాగనంపి, నాగుమయ్య పూర్ణాయువుగా చల్లగా వుండాలంటే అవసరమే' అన్నాడు శంకరశాస్త్రుర్లుగారు నిర్లిప్తంగా.

ఎట్టిపరిస్థితులలో కూడా నాగుమయ్య సాధన చేస్తున్నవైపు పెద్ద కొడుకు రాకుండా జాగ్రత్తపడ్డాడు శాస్త్రుర్లుగారు. ఆ బీజాక్షరమంత్రాలు పెద్దకొడుకు చెవులబడకుండా కట్టడిచేశాడు. నాగమణి మాయమైన పుష్కరకాలానికి బ్రహ్మగారుడం సిద్ధించింది నాగుమయ్యకు. ఆసరికి ఆయనపెద్దకొడుకు వ్యాధి తీవ్రస్థాయికి చేరుకుంది. తమ్ముడి పొడ గిట్టకుండా పోయింది. ఎప్పటికప్పుడు పొలుసుల చర్మం వూడిపోయి కొత్త చర్మం తళతళలాడుతున్నా శరీరం పొడలమయం అయిపోయింది. పగటిపూట గదిలోనుండి బయటకు వచ్చేవాడు కాదు. రాత్రిళ్ళు తండ్రి అతడిని బయటకు రానిచ్చేవాడు కాదు. లోపల వుంచి తలుపులు బయటినుండి బిగించేవాడు.

కొన్నిరోజులకు అందరూ గమనించారు, కిటికీ చువ్వలగుండా ఎలా బయటపడేవాడో, రాత్రి అంతా ఎక్కడెక్కడ తిరిగేవాడో, మట్టి గొట్టుకున్న శరీరంతో చాటుగా నక్కుతూ పాకుతూ వెనుక నుండి ఇంట్లోకి వచ్చేవాడు. ఒకోసారి నోరు, మెడ రక్తసిక్తమై వుండేవి. 'ఆ భయంకరమైన వ్యాధి లక్షణమే అది, నోటివెంట పల్చగా రక్తం పడుతుంది' అని చెప్పాడు శాస్త్రుర్లు గారు. ఔనేమో అనుకున్నారు అందరూ. రానురానూ ఎలాగోలా ఆరాత్రి వెళ్ళిపోయినవాడు, మరునాడు రాత్రికికూడా రాకపోయేవాడు. ఒకోసారి రెండు మూడు రోజులవరకూ వచ్చేవాడు కాదు. అందరూ తలోవైపూ వెతుక్కుంటూ

వెళ్ళేవాళ్ళు. కంపలలోనో, పుట్టలమీదో, పాండవులగుట్టమీద బండరాళ్ల మధ్యనో మగతగా పడి వుండేవాడు. సాధ్యమైనంతవరకూ చిన్నకొడుకును వెంట తీసుకుని, పెద్దకొడుకును వెదకడానికి తానే వెళ్ళేవాడు శాస్త్రుర్లుగారు.

పార్వతమ్మ ఆవేదనకు అంతులేకుండా పోయింది. రానురానూ తల్లిని కూడా పెద్దకొడుకు దగ్గరకు వెళ్లకుండా కట్టడి చేశాడు శాస్త్రుర్లుగారు. అంతగా ముదిరిపోయిందట ఆ చర్మవ్యాధి! తను కూడా మరీ తప్పనిసరి అయితేనే దగ్గరికి వెళ్ళేవాడు. నాగుమయ్యను మాత్రం వెళ్లనిచ్చేవాడు అన్నదగ్గరకు. క్రమేపీ విపరీతమైన కోపంతో బుసలుకొడుతూ మీదపడి కొరకడానికి, రక్కడానికి ప్రయత్నం చేసేవాడు పెద్దకొడుకు. అలా ఉన్మాదిలా ప్రవర్తించడం ఆ వ్యాధిలక్షణం, ఆ కొరకడం రక్కడం విషతుల్యం, ప్రాణాంతకమైన ఆ వ్యాధి అంటుకుంటుంది అని అందరినీ జాగ్రత్తపరిచేవాడు శాస్త్రుర్లుగారు.

పన్నెండు సంవత్సరాల సాధన తరువాత బ్రహ్మగారుడం సిద్ధించింది నాగుమయ్యకు. అప్పటికి కవల అన్నదమ్ములిద్దరూ పదిహేడు సంవత్సరాలు నిండి పద్దెనిమిదవ సంవత్సరం వయసులో అడుగుబెట్టారు. కసిమీదున్న కాలనాగులా మిసమిసలాడిపోతున్నాడు పెద్దకొడుకు. రెండురోజులక్రితమే పౌర్ణమినాడు పొలుసుల చర్మం వూడి, చలాకీగా వున్నాడు. కణకణలాడుతున్న నిప్పులా వున్నాడు చిన్నకొడుకు. కద్రువ దాస్యంనుండి కన్నతల్లిని విడిపించిన గరుత్మంతుడిలా కళకళలాడిపోతున్నాడు.

ఆ రాత్రి ఒక బ్రహ్మాండమైన గరుడపక్షిని కలలో చూశాడు నాగుమయ్య. అప్రయత్నంగా ధ్యానమంత్రం ఉచ్చరించడం మొదలుపెట్టాడు కలలోనే. 'కపిలాక్షం గరుత్మన్తం సువర్ణసదృశప్రభమ్ దీర్ఘబాహుం బృహత్స్కన్ధం నాగాభరణభూషితమ్' అంటూ సాగుతున్నది ధ్యానం. కాల్చిన బంగారురంగులో మెరిసిపోతున్న కళ్ళను గుండ్రంగా తిప్పుతూ నలువైపులా కలయజూసింది ఆ కొండలాంటి గరుడపక్షి.

ఎంత పొడవున్నయ్యో తెలియని చేతులను సాచి పెనవేసుకున్నది నాగుమయ్యను. ఆ దృఢమైన భుజాలకు, ముంజేతులకు కంకణాలలాగా మెరిసిపోతున్న సర్పాలు మెలికలు తిరుగుతూ నాలుకలు తిప్పుతున్నాయి. ఆ గరుడపక్షి శరీరమంతా బంగారపు కాంతులతో మెరిసిపోతున్నది. విచ్చుకున్న తెరచాపలలాంటి విశాలమైన రెక్కలు రంగురంగుల ఈకలతో వేల ఇంద్రధనుస్సులు ఒక్కసారిగా విరిసినట్లు వున్నది. ఆ రెక్కలు కదులుతుంటే యేదో మధురమైన నాదంలా, వేదంలా వినిపిస్తున్నది. విచ్చుకత్తిలా ఒంపు తిరిగిన పదునైన ముక్కు నీలాలు పొదిగిన నిలువెత్తు ఖడ్గంలా మెరుస్తున్నది. ఆ బలమైన రెక్కలు నెమ్మదిగా లేచి ఒక్కసారిగా రెండువైపులనుండీ కమ్ముకుని నాగుమయ్యను కప్పివేశాయి. మాటలలో వర్ణించలేని హాయి కలిగింది నాగుమయ్యకు. వరదలా ధ్యానశ్లోకాలు వెలువడుతూనే వున్నాయి నోటివెంట.

అలా ఎంతసేపో తెలియదు. ఏవో ఆర్తనాదాలు లీలగా వినిపించాయి. చటుక్కున మెలకువ వచ్చింది. యింకా పూర్తిగా వదలని నిద్రమత్తులో స్పష్టంగా వినిపించాయి బాధతో, కోపంతో అరుస్తున్న అరుపులు. తలతిప్పి అటువైపు చూశాడు. కిటికీ చువ్వలను విరిచేంత కసితో పట్టి వూపుతూ ఆక్రోశిస్తున్న అన్న కనిపించాడు లోపలినుండి. లేచికూర్చున్న తమ్ముడి చూపులు తనమీద పడటంతోనే అరుపులు ఆగిపోయాయి. కోపంతో బుసలు కొడుతున్నట్లుగా కొంతసేపు కనిపించాడు. కిటికీ చాటుకు తప్పుకున్నాడు.

ఆ అలజడికి దూరంగా వున్న కొష్టాలలో పశువులు కదిలిన ధ్వనులు వినిపించాయి. ఆ ప్రక్కన అశ్వశాలలో వున్న మేలుజాతి గుర్రాలు రెండు సన్నగా సకిలించిన ధ్వనివినిపించింది. ఒకటిన్నర దశాబ్దం కాలంలో వందల సంఖ్యలో పశుసంపద, వేల ఎకరాల సుక్షేత్రమైన పంటభూములు, యినాములు, అగ్రహారాలు అయాచితంగా సమకూరాయి శాస్త్రుర్లు గారికి. అరుపులకు, పశువుల అలికిడికి లేచిన పనివాళ్ళు పాలేర్లు సమీపించి ఏం చేయాలి అన్నట్లు చూశారు. సింహద్వారం తెరుచుకుని శాస్త్రుర్లు గారు, ఆ వెనుక ఆదుర్దాగా పార్వతమ్మ, నాగుమయ్యను సమీపించారు. కోళ్లు కూశాయి.

మౌనంగా చిన్నకొడుకు ప్రక్కన కూర్చున్నాడు శాస్త్రుర్లుగారు. నెమ్మదిగా తాను చూసిన కల గురించి తండ్రికి చెప్పాడు నాగుమయ్య. ఆనందంగా కొడుకు తలమీద నిమిరాడు శాస్త్రుర్లుగారు ఆశీర్వదిస్తున్నట్లు. అంతలోనే నిస్సత్తువతో ముడుచుకున్నట్లు తలదించుకుని ఆలోచనలలో మునిగిపోయాడు. ఆయనకు తాను అప్పటిదాకా చూసిన కల గుర్తుకు వచ్చింది. ఆ కల ఆ రాత్రే కాదు, గత నెలరోజులుగా ఆయనను వెంటాడి వేధిస్తున్నది. పదిహేడేళ్లక్రితం మొదటిసారిగా కనిపించి, కళ్ళెదురుగా కాలనాగు కాటుకు గురై కనుమూసిన తాత కలలో కనిపిస్తున్నాడు ప్రతి రోజూ. ఉలుకూ పలుకూ లేకుండా మౌనంగా రాత్రంతా ఎదురుగా కూర్చుని వున్నట్టు కనిపిస్తాడు, అంతే.

కల చెదురుతుంది. మెలకువ వస్తుంది. పితృదేవతలు అలా ప్రతినిత్యమూ దర్శనమివ్వడం మంచిదికాదని తెలుసు శాస్త్రుర్లు గారికి.

ఏదో అనర్థం జరుగబోతున్నదని గత కొద్దిరోజులుగా ఆయన మనసు శంకిస్తున్నది.

కాలకృత్యాలు తీర్చుకుని స్నానం, సంధ్యావందనం ముగించుకుని కచ్చడం ఎక్కుతుండగా కలవరం చెలరేగింది. పెద్ద బాబు మరలా ఎటో వెళ్లిపోయాడని పనివాళ్ళు కంగారుపడుతూ వార్త తెచ్చారు. అప్పటికి రెండు మాసాలుగా ఒక ఔషధాన్ని సిద్ధంచేస్తున్నాడు శాస్తుర్లుగారు. ఈ రోజుతప్పనిసరిగా వెళ్ళాలి, లేకుంటే రెండుమాసాల ప్రయత్నం వృధా అవుతుంది. సింహాచలం రాజావారి చిన్నరాణి కోసం ఒక ఔషధాన్ని సిద్ధం చేస్తున్నాడు ఆయన. నాగవరప్పాడు అగ్రహారానికి జమిలివాయి కొండకు సరిగా మధ్యలో ఎడారిలాంటి ఇసుకనేలలు, ఊసరక్షేత్రాలు వున్నాయి. అక్కడ బ్రహ్మజెముడు, నాగజెముడు, బొంతజెముడు, సన్నజెముడు మొదలైన రకరకాల జెముడు మొక్కలు దట్టంగా పెరిగివుంటాయి. సరిగ్గా ఉపయోగించడం తెలిస్తే అవి దివ్యమైన ఔషధాలుగా మారుతాయి.

బ్రహ్మజెముడు కాండాన్ని తొలిచి, స్రవించే పాలలాంటి ద్రవంలో మంచిపసుపుకొమ్మలను మూడురోజులు నానబెట్టి, తరువాత మూడురోజులు ఎండబెట్టాలి. అలా ఏడుసార్లు చేసి, ఆ పసుపుకొమ్ములను అరగదీసి ఆ గంధాన్ని లేపనంగా పూస్తే ఎంతటి భయంకరమైన చర్మవ్యాధి అయినా కనిపించకుండా పోతుంది. అన్నను మరలా వెతికి పట్టుకునివచ్చే బాధ్యతను నాగుమయ్యకు అప్పగించి, భార్యకు జాగ్రత్తలు చెప్పి కచ్చడం ఎక్కి, ముందుకు కదిలించుమని చెప్పాడు తోలేవాడికి.

ఎడ్ల మువ్వల చప్పుడు ఆగి, బండితోలేవాడి హెచ్చరిక వినిపించి తన ఆలోచనలలోనుండి బయటపడి, బండి దిగాడు శాస్తుర్లుగారు. పది, పదిహేను, యిరవై అడుగుల ఎత్తున పెరిగిన నానాజాతుల జెముడు పొదలను సమీపించాడు. పొదలను సమీపిస్తుండగా ఆయనను గమనించి సరసరా వెనక్కు తప్పుకున్న ఆకారాన్ని ఆయన గమనించలేదు.

రెండునిలువుల ఎత్తున పెరిగిన బ్రహ్మజెముడు మొక్కలకు గుచ్చిన పసుపుకొమ్ములను జాగ్రత్తగా మూటగట్టుకున్నాడు. వెనుదిరుగుతుండగా ఆ వెనుక వున్న నాగజెముడు మొక్కలముళ్ళకు చిక్కి, వీస్తున్న వడగాలులకు పైకెగిరిన పచ్చని పై వస్త్రం కనిపించింది. జెండాలా ఎగురుతున్న దాన్ని గమనించి, చుట్టూ తిరిగి వెనక్కు నడిచాడు శాస్తుర్లుగారు. కొద్దిగా ఎడంగా వుండి గమనిస్తున్న బండితోలే పాలేరు ఆయనను వేగంగా అనుసరించాడు. వీరి రాకను గమనించి మెరుపులా వెనుక వున్న మట్టిదిబ్బలను దాటుకుని, ఆ వెనుక తుప్పలు, పొదలమధ్యకు వెళ్ళిపోయింది వికృతమైన ఆకారం.

కొన్నిక్షణాలపాటు పరిశీలనగా చూసి ఆ ఉత్తరీయాన్ని గుర్తుపట్టాడు శాస్తుర్లుగారు. మంగళగిరి నేతగాళ్ల పనితనానికి మచ్చుతునక ఆ ఉత్తరీయం. మంగళగిరి జమీందారు రెండు నెలల క్రితం ఉగాది ఉత్సవాలకు ఆహ్వానించి సమర్పించిన వస్త్రాలలోది. అది అక్కడికి ఎలా వచ్చిందో వూహించగలిగాడు. గత రాత్రి బలవంతంగా స్నానం చేయించి, ఆ వస్త్రాన్నే పెద్దకొడుకు నడుముకు జాగ్రత్తగా చుట్టించాడు తన చిన్నకొడుకు నాగుమయ్యతో. వెనుదిరిగి కనుచూపుమేరా కలయజూశాడు శాస్తుర్లుగారు. అర్థం చేసుకున్న బండివాడూ చుట్టూ కలయజూశాడు, పెద్ద బాబుకోసం. అల్లంత దూరంలో వున్న తుప్పలవైపు అడుగులేశాడు. గమనించిన ఆ వికృతాకారం వడిగా వెనుక వున్న కందకంలాంటి నెర్రెలోకి జారుకుంది. అంతే వేగంతో వెనుక వున్న దిబ్బలచాటుకు తప్పుకుంది. కొంతమేర కలయజూసి వెనుతిరిగారు యిద్దరూ. ఆ వస్త్రాన్ని తీసుకుందామని దగ్గరకు నడిచి, అంతలోనే ఆ ఆలోచన విరమించుకుని బండివైపు నడిచాడు శాస్తుర్లుగారు.

గడిచిన ఒకటిన్నర దశాబ్దకాలపు పరదాల మాటుకు మళ్ళీ వెళిపోయాడు శాస్తుర్లుగారు. రెండున్నర గంటల ప్రయాణం ఎలా జరిగిందో గమనించలేదు. ఊరుకు చేరుకున్నది కచ్చడం. అల్లంత దూరంలో యింటిముందు గుంపులు గుంపులుగా జన సమూహాన్ని చూసి కీడు శంకించింది మనసు. కచ్చడం ముందుకు వెళ్ళినకొద్దీ బిగ్గరగా రోదిస్తున్న ఆడగొంతుకలు వినిపించాయి. గుండెలు బాదుకుంటూ పెద్దపెట్టున శోకాలు పెడుతూ కచ్చడంవైపు పరుగెత్తుకొస్తున్న మగవాళ్ళు కనిపించారు. ఇంటిముందు కచ్చడం ఆగింది. ఆందోళనతో దూకినట్టుగా వడిగా దిగబోయి వయోభారంతో తూలాడు శాస్తుర్లుగారు. శోకాలు పెడుతూనే చప్పున ముందుకు దూకి, ఆయనకు వూతంగా నిలిచి, పొదివి పట్టుకుని ముందుకు నడిపించారు యిద్దరు. ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని చూసి శివశివా అని ఆర్తనాదాలు చేస్తూ కుప్పకూలాడు శాస్తుర్లుగారు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS